# ఇదేం చోద్యం



రైతుబంధు సాయం రూపాయి వచ్చిందంటూ సెల్‌ఫోన్‌లో వచ్చిన మెసేజ్ చూపిస్తున్న రైతు పాండురంగారెడ్డి

- రైతులు విస్తుపోయేలా పెట్టుబడి సాయం
- ఒకరికి రూ.1, మరొకరికి రూ.62 సాయం
- పాలమూరు జిల్లా రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్
- ఖాతాల్లో జమైన డబ్బు చూసి కర్షకుల అవాక్కు
- రేవంత్ సర్కారు ఘనకార్యంపై ఆగ్రహం

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సాగుకు సాయంగా రైతుబంధు పడుతుందని ఆశతో ఉన్న రైతాంగానికి రేవంత్ సర్కార్ ఝలకిస్తోంది. యాసంగి సాగుకు కేసీఆర్ సర్కార్ ఇచ్చినట్లే రైతుబంధు జమ చేస్తామని ప్రకటించి ఆరు రోజులైనా ఇంకా రైతుల ఖాతాల్లోకి టింగ్.. టింగ్‌మంటూ మెసేజ్‌లు రావడం లేదు. ఐదెకరాలలోపు రైతాంగానికి ఇవ్వాలని ఆదేశించినప్పటికీ అరకొరగా రైతుబంధు పడుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ రైతుకు రైతుబంధు ఒక్క రూపాయి పడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఏ లెక్కలో ఒక్క రూపాయి వేశారో అర్థం కావడం లేదని ఆ రైతు వాపోతున్నాడు. మరికొంత మందికి రూ.100లోపే రైతుబంధు డబ్బులు పడడం విస్తు గొలుపుతున్నది. దీంతో రైతుల ఆశలు నీరుగారుతున్నాయి. ఎకరాకు రూ.15వేలు ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు ముఖం చాటేస్తున్నదని రైతన్నలు విమర్శిస్తున్నారు. యాసంగి సాగు దగ్గర పడుతున్న కొద్దీ రైతుబంధుపై ఆశ పెట్టుకున్న వేలాది మంది రైతుల్లో గుబులు రేగుతోంది. ఇక అప్పు తప్పదేమోనని ఆందోళన చెందుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటి వరకు 55,184 మందికి రూ.11.38కోట్లు, నారాయణ పేట జిల్లాలో 27వేల మందికి రూ.5 కోట్ల 75 లక్షలు, గద్వాల జిల్లాలో 20,229 మందికి రూ.4కోట్ల 59లక్షల 8,979, నాగర్‌కర్నూల్ జిల్లాలో 54,900 మంది రైతులకు రూ.12.45 కోట్లు రైతుబంధు జమ అయ్యింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు కేవలం రూ.25కోట్లు మాత్రమే జమ అయ్యాయి. ఈనెల 13 నుంచి రైతుబంధు ఐదెకరాలలోపు సన్న, చిన్నకారు రైతులకు వారి ఖాతాలో జమ చేస్తున్నారు. కాగా, చాలామంది రైతులకు పొంతనలేని విధంగా డబ్బులు పడుతుండడంతో అయోమయంలో పడ్డారు. గతంలో 11సార్లు రైతుబంధు గుంటల్లోనే పడినప్పటికీ ఈసారి మాత్రం రైతులకు అరకొర డబ్బులు పడుతున్నాయి. దీంతో అయమయంలో రైతులు వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

**రూపాయి రైతుబంధు జమ..**

మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ రైతుకు రైతుబంధు కింద ఒక్క రూపాయి జమ కావడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. మూడు రోజుల తర్వాత రైతుబంధు డబ్బులు పడినట్లు వచ్చిన మెసేజ్ చూసి అవాక్కయ్యాడు. హన్వాడ మండలానికి చెందిన పాండు రంగారెడ్డికి ఐదెకరాల పొలం ఉండగా, కేవలం ఒక్క రూపాయి రైతుబంధు డబ్బులు జమ అయ్యాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం తమకు రైతుబంధు ఏడాదికి రెండుసార్లు ఎకరానికి రూ.10వేల చొప్పున జమ చేసేదని, ఈసారి కేవలం ఒక్కరూపాయి పడడం విడ్డూరంగా ఉందన్నారు. మండలంలోని టంకరకు చెందిన ఆంజనేయులుకు కూడా రూ.62 రైతుబంధు డబ్బులు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఇతనికి రెండు గంటల భూమి ఉంది. ప్రతిసారీ రూ. 250 పడేవి. ఈసారి కేవలం రూ.62 పడడంతో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తనకు ఇంకా ఎకరన్నర భూమి వేరే సర్వేనెంబర్‌లో ఉన్నదని, ఇంకా డబ్బులు పడలేదని చెబుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మారగానే రేవంత్ సర్కార్ రైతుబంధు పైసలు రైతుల ఖాతాల్లో ముందుగా ఐదెకరాలలోపు రైతులకు జమ చేయడం ప్రారంభించింది. ముందుగా ఎకరంలోపు, తర్వాత మిగతా వారికి రైతుబంధు డబ్బులు ఖాతాలో జమ చేస్తామని చెప్పినా పూర్తిస్థాయిలో జమకాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతకీ రైతుబంధు వస్తుందా, లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**అప్పులు తప్పేలా లేవు..**

యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత నెలలోనే కేసీఆర్ సర్కారు జమచేస్తామంటే కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు వేయొద్దని ఈసీకి ఫిర్యాదు చేశారు. పోలింగ్ రెండు రోజులు ఉందనగా ఈసీ రైటుబంధుకు అనుమతి ఇవ్వగా, మళ్లీ అడ్డుకోవడంతో రైతుల ఖాతాల్లో జమ కాలేదు. కొత్త సర్కార్ వచ్చాక రైతులు రైతుబంధుపై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని గొప్పలు చెప్పిన రేవంత్ సర్కార్ చివరికి పాత పద్ధతిలోనే ఇచ్చేందుకు మొగ్గుచూపారు. ఇచ్చే డబ్బులు ఇప్పటికీ రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

# స్వామియే శరణం అయ్యప్పా

- నామస్మరణతో మార్మోగిన కొత్తకోట
- 108 కలశాలతో ఊరేగింపు



కలశాలు, కావడితో ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

కొత్తకోట, డిసెంబర్ 18 : కొత్తకోట పట్టణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. సోమవారం ఉదయం 4గంటలకు గణపతి హోమంతో అంబా భవానీ ఆలయంలో అయ్యప్పస్వామికి అభిషేకించి కలశాలను సుబ్రహ్మణ్యస్వామికి అర్పించి కావడిలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మేళ తాళలు, బాజాభజంత్రీలతో కొలటాలు, బతుకమ్మలతో శోభయాత్రగా భూతనాథ అయ్యప్పక్షేత్రం వరకు 108 కలశాలు, కావడిలను ఊరేగింపు చేపట్టారు. అన్నదాన క్షేత్రానికి చేరుకొని గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వాములకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాగరాజు, అనీల్‌కుమార్, గంగాధర్, లింగేశ్వర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# మంచు కురిసే వేళలో..



గద్వాలలో కురుస్తున్న మంచు

వేకువజామున మంచు దుప్పటి కప్పుకొంటున్నది. పది రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో మంచు కురుస్తూ చలి చంపేస్తోంది. ఉదయం 9గంటలు దాటినా మంచు కురుస్తూనే ఉండడంతో ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేలా ఉన్నప్పటికీ వివిధ పనులపై వెళ్లే వారికి మాత్రం కొంత ఇబ్బందులను తెచ్చిపెడుతున్నది. అయినప్పటికీ ఉద్యోగాలకు వెళ్లేవారు, స్కూల్ విద్యార్థులు, పేపర్ బాయ్స్, ప్రయాణికులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, గొర్రెలు కాసేవారు తప్పని పరిస్థితుల్లో అలాగే తమ పనులకు వాహనాల్లో వెళ్లే రికి మంచు కారణంగా ఎదురుగా వచ్చే వెహికిల్స్ కనిపించడం లేదు. దీంతో నెమ్మదిగా గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తున్నది.

# ప్రభుత్వమే ఆదుకోవాలి..

జడ్చర్ల టౌన్, డిసెంబర్ 18 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ ఆటో డ్రైవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని రోడ్డున పడేసిందని జడ్చర్ల ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ హాజీ అన్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం జడ్చర్లలో ఆటోడ్రైవర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆటోయూనియన్ నాయకులు మాట్లాడారు. ఆటోలపై ఆధారపడిన మాకు జీవనాధారం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోల్లో గిరాకీ లేక ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. కిస్తులు చెల్లించలేకపోతున్నామని, ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15వేలు ఆర్థిక సాయం చేయాలని కోరారు. అలాగే ఆటోడ్రైవర్లకు డబుల్‌బెడ్రూం ఇండ్లు, హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు అశోక్, నర్సింగ్, ఇమ్రాన్, పెంటోజీ, లక్ష్మణ్, ఖాజపాషా, చాంద్ పాషా, రవీందర్, రాఘవేందర్, కార్తీక్, మహేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.




జడ్చర్లలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు



గద్వాలలో చలి మంటను కాచుకుంటున్న చిన్నారులు



మంచుతో మహబూబ్‌నగర్ పట్టణం



గద్వాలలో మంచులోనే గొర్రెలు కాస్తున్న కాపరి





గద్వాల శివారులో మంచుతో కమ్ముకొన్న పొలాలు

ఫొటోలు : మహబూబ్‌నగర్/ జోగులాంబ గద్వాల ఫొటోగ్రాఫర్స్



మంచుదుప్పటి కప్పుకొన్న మహబూబ్‌నగర్ పట్టణం



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు, యజమానులు, సీఐటీయూ నాయకులు



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు, యజమానులు

# ఆటోవాలా ఆగ్రహం

- ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల నిరసనలు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో బతుకు బండి కుదేలంటూ ఆందోళన
- రోడ్డున పడుతామని ఆటో డ్రైవర్ల ఆవేదన
- కాంగ్రెస్ ప్రభుత్వం మా బతుకులు ఆగం చేసిందన్న ఆటో యూనియన్లు
- తమకు ఉపాధి చూపించాలి డిమాండ్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 18 : ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మేం రోడ్డున పడ్డామని.. ఆటోలు నడుపుకొని మా కుటుంబాలను పోషించుకునేవారని, నేడు రూపాయి ఆదాయం లేక కిస్తులు కట్టలేక, కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆటోవాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మాకు ఉపాధి కరువైందని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆటోడ్రైవర్లు ఆందోళన చేపట్టారు. పట్టణంలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రవాణారంగంపై 50లక్షల మంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. వీరి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహాలక్ష్మి పథకం ప్రారంభించడం వల్ల కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైనాన్స్‌లో వివిధ రకాల వాహనాలు తీసుకొచ్చి వాటిని నడపలేక ఫైనాన్స్ కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఏడాదికి రూ.12వేలు చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా మాట ఇచ్చి ఆ పథకాన్ని అమలు చేయకుండా కార్మికుల పొట్ట గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ యూనియన్లతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, ప్రధాన కార్యదర్శి పొదిల రామయ్య, ఉపాధ్యక్షుడు శివకుమార్, ఆటో యూనియన్ నాయకులు మల్లేశ్, మైబు, సైదులు, మహేశ్, శివ, సుబ్బయ్య, సిరాజ్, శ్రీను, సుల్తాన్, ఖయ్యూం, వేణుగోపాల్, కృష్ణ, రాఘవేంద్ర, పరమేశ్, వెంకటేశ్, బాలస్వామి, కృష్ణయ్య, కురుమయ్య, రాజు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలు బంద్ చేసి మేమెట్లా బతకాలె..?

దేవరకద్ర, డిసెంబర్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటోడ్రైవర్ల జీవనం అయోమయంలో పడిందని ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు కుర్వ రాము అన్నారు. సోమవారం దేవరకద్రలోని ప్రధాన రహదారి వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం మహిలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ మా కడుపుకాలే చర్యలు తీసుకున్నదన్నారు. దేవరకద్ర మండలంలో దాదాపు 200 కుటుంబాలు ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నాయని, వారందరికీ నేడు ఆదాయం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మా పరిస్థితిని గమనించి నెలకు రూ.15వేలు సాయం అందించి ఆదుకోవాలన్నారు.



దేవరకద్రలో మాట్లాడుతున్న ఆటో యూనియన్ అధ్యక్షుడు రాము